# నీకూ-నాకూ మాటల్లేవ్..!

భమిడిపాటి రామగోపాలం

వై. మధు

స్వామి మహత్తరానంద ఉపన్యాసం విని ఇంటికి స్కూటర్ మీద వొచ్చారు ప్రకాశం, జ్యోతీ. అసలు అలాంటి ఉపన్యాసాలు వినే స్థాయికి వాళ్ళింకా చేరలేదు.

"ప్రపంచం అశాశ్వతం"

"జీవితం బుద్బుదప్రాయం"

"ఐహిక సుఖాలే పరమ అనర్థాలకి మూలం"

"అరిషడ్వర్గాన్ని జయిస్తే తప్ప పరిపూర్ణ మానవుడు కాలేడు"

—ఇలాటివేవో చెప్తారు సాధారణంగా ఆ ఉపన్యాసాల్లో. ఆచరించడంమాట ఎలావున్నా జీర్ణించుకోడమే కష్టమనిపించే పరిస్థితులు వాళ్ళవి. ఎటుచూసినా ఆమెకి ప్రకాశమే అతనికి జ్యోతే కనబడే ప్రపంచం వాళ్ళది.

కాని స్వామి మహత్తరానంద సామాన్యుడు కాడు. కొమ్ములు తిరిగిన ప్రాపంచికుల్ని క్షణాల్లో ఆధ్యాత్మిక చింతనాపరులుగా మార్చేసిన ఉదంతాలు అతని ఆముష్మిక చరిత్రలో కొల్లలు. ఆ దారమ్మట వస్తూవుంటే ఆ హాలు గేటు దగ్గర కాషాయ వస్త్రాలేసుకున్న ఓ వ్యక్తి వాళ్ళని ఆపి "స్వామీజీ ఉపన్యాసం విని వెళ్ళండి చిరంజీవులూ" అన్నాడు.

అంతే సంగతులు.

ఉపన్యాసం షడ్రసోపేతంగా వుంది. చెప్పేది వేదాంతమే అయినా స్వామి ఉదహరించింది ప్రపంచమే. పిల్లిమీదా ఎలకమీదా పెట్టి పిట్టకథలు చెబుతూ మహత్తరమైన హాస్యోక్తులు పేల్చారు. అయినా నవ్వడం సమంజసం కాదుగనక వీళ్ళే కాదు - అక్కడ కూచున్న రెండువందలమందిలో ఒక్కరుకూడా నవ్వలేదు. మనసుల్లో ఏమనుకున్నారో తెలియదు కదా!

అలాగే, జ్యోతికీ ప్రకాశానికీకూడా — పిల్లలిద్దరూ సెలవులకి ఊరెళ్ళి పోయారని, ఈ పూటకి వంట పూర్తయిపోయిందని, రాత్రి రేడియోలో గొప్ప ప్రోగ్రాములేవీ లేవని, ఒకరితో ఒకరు చెప్పుకుని నిబ్బరించుకున్నట్టుండిపోయారు.



తిరిగొచ్చేటప్పుడు స్కూటరు మీద కూడా ఎప్పట్లా కూచోలేదువాళ్ళు. ఈ చేత్తో ఈ రింగు పట్టుకున్నానుకదా ఇంతట్లోకే పడిపోతానా అన్నట్టు జ్యోతి కూచుంది. తను ముందుకి వొంగినా బొజ్జమీద కుడిచెయ్యి వెయ్యకపోయినా తను అక్కడ కూచునే ఉందిగాని తోవలో యెక్కడా రాలిపోయి వుండదని ప్రకాశమూ సరిపెట్టుకున్నాడు.

రాత్రి భోజనాలు చేస్తూ వాళ్ళాడుకున్న మాటలు మరీ అంత "తాత్వికంగా" లేకపోయినా ఎప్పట్లాంమాత్రం లేవు. ఆఖర్ని జ్యోతి అంది, "రేపు ఏకాదశి. మీకు శలవుకూడా వచ్చింది. నాబొజ్జా, నా యిల్లూ, నా లోకం అనే తాపత్రయం ఒక్క రోజుపాటు కట్టిపెట్టి మౌనం పాటిద్దామండీ."

"ఔను. ఎన్నెన్నో చెప్పేరు. అవన్నీ యెలాగూ చెయ్యలేం. ఇలా వారానికో రోజో, నెలకోరోజో మౌనం పాటించినా కూడా మంచిదే. పుణ్యమూ, మోక్షమూ కావాలని కాదుగాని ఆరోగ్యం అని అన్నారుగా స్వామీజీ!" అని తనూ ఆ దారికే చేరేడు ప్రకాశం.

"మా పెదనాన్నగారు, మీకు తెలుసో లేదో; ప్రతి సోమవారం మౌనవ్రతంలో ఉండేవారు. అరవై అయిదేళ్ళొచ్చినా ఒక్క వెంట్రుక తెల్లబడలేదు. మా నాన్నగార్నీ ఆయన్నీ వోచోట చూసినవాళ్ళు మీతమ్ముడుగారా అని అడగడం, అయ్యో మా అన్నగారండీ; నాకన్నా పన్నెండేళ్ల పెద్ద! అని ఈయన నవ్వుకోడం—"


"నాకెందుకు తెలీదు? ఆయన ఎలమంచిల్లో వుండేవారు. మన పెళ్ళికొచ్చేరు. (ఆవేళ సోమవారమే) ఆ తరవాతకూడా ఓసారి ఆయన్ని రైల్లో కలిశాను, ఆరోజూ సోమవారమే. కాగితంమీద రాసి పలకరించారు నన్ను - అబ్బాయీ! నువ్వూ, జ్యోతీ పిల్లాడూ కులాసా? అని. అప్పటికింకా పాప పుట్టలేదు."

"ఇహ నేమ్మరి? రేపంతా మనం మాట్లాడు కోకూడదని ఇదే నిర్ణయం. అంతగా సంజ్ఞల్తో బోధపడనిదేదైనా ఉంటే కాయితాల మీద రాసుకుందామేం?"

* * *

ఉదయం ఆరున్నరకి పాల మనిషి దగ్గిరే వ్రతభంగం అయినంత పనైంది జ్యోతికి. సెలవు రోజున ప్రకాశం ఇంటి దగ్గిరే ఉండి పోతాడు. బైట తాగే కాఫీలు (కనీసం మూడు పోయేకోగా నాలుగు) ఇంట్లోంచే రావాలి. అంచేత అర లీటరు పాలు చాలవు. పిల్లలు ఊళ్ళోలేరు కదా. అని లీటరు పాలు అరలీటరుకి తగ్గించుకున్నారు, ఐతే మరి సెలవు రోజున ఎలా లేదన్నా మరో పావు లీటరు అవసరం. ఆ మాట పాలమ్మితో చెప్పే పద్ధతి ఎరుక్కొచ్చేసరికి గగనం అయింది. "మరో డబ్బా పొయ్యి" అని మూడు మాటల్తో చెప్తే పోయేది. వెనక్కి తిరిగి వెళ్ళిపోతున్న ఆ మనిషి చెయ్యి పట్టుకుని ఆపి, జాడీలోంచి ఆ డబ్బా అందుకుని; 'ఒకటి' అన్నట్లుగా వేలితో చూపించి గిన్నె ముందుకి జాపింది జ్యోతి. అయినా ఆ మట్టి బుర్రకి అర్థం కాలేదు. "ఒకటే టమ్మా; రెండు కొల్చి పోసినాను గాదా?" అంది: "అదికాదు ఇంకోటి ఎగస్త్రా" అందామని, తల అడ్డంగ ఆడించింది జ్యోతి. "ఏటమ్మా ఇంకా నిద్దర తీర్నేదా? రెండు డబ్బాలు పోస్తే సూసుకుని కూడా ఒకటే పోశానంతావా?" అని జ్యోతి చేతిలోంచి గిన్నెలాక్కుని పాలన్నీ జాడీలో వొంపేసుకుని "ఇప్పుడు సరీగ సూడు." అని; "ఒకటీ"; "రెండూ" అని లెక్కగా స్పష్టంగా కొలిచి; గిన్నె ముందుకి తోసి, "ఎల్లెల్లు. నా కవతల పనుంది" అని గిర్రున తిరిగింది పాల మనిషి. మళ్ళీ దాన్ని ఆపి; ఈ మారు మూడు వేళ్ళు చూపించి; పొయ్యమని గిన్నె ముందుకి జాపింది జ్యోతి. "ఓస్ అదా? అని; మరో డబ్బాడు పాలు పోసి; "నోటితో సెప్ప కోడదా? బంగారం రాలి పోద్దిగావాల!" అని విసుక్కుంటూ పోయింది.

"వాక్కు వెండి వంటిది, కాని మౌనం స్వర్ణమే," అని రాత్రి స్వామీజీ




చెప్పిన మాటలు మనసులో మెదిలాయి జ్యోతికి. పాల మనిషికి అక్షర జ్ఞానం లేనందుకు తొలిసారిగా ఆమెకి విచారం వేసింది.

"మీరు రోజూలాగా 'కాఫీ' అని అరవకండి, ఇవాళ మౌనవ్రతం, నేనే, కాఫీ తయారవగానే తెచ్చి ఇస్తాను." అని చీటీ రాసి ప్రకాశం చేతికి అందేటట్టు పెట్టినా సరే; (అతడు నిద్రలో అట్నుంచి ఇటు వొత్తిగిలడం వల్ల ఆ చీటీ కనుమరుగై పోయి కాబోలు) లేచీ లేవగానే "కాఫీ!?" అని కేక పెట్టేశాడు. పరుగెత్తుకుంటూ వెళ్ళింది, జ్యోతి చీటీ ఏరి అతని చేతిలో పెట్టి, నోటికి చెయ్యి అడ్డంపెట్టి నవ్వింది. ప్రకాశం చీటీ చదువుకుని, తలాపి దిక్కున టీపాయ్ మీదున్న పెన్ తీసి "సారీ" అని రాశాడు ఆ చీటీ మీదనే ఓ మూల.

* * *

ఎనిమిదిన్నర దాటేక మేడమీది వాటాలో ఉంటున్న సుందర్రామయ్యగారబ్బాయి "ఏమండీ మీకు ఫోన్!" అని కేకేసి తుర్రుమని మెట్లెక్కి వెళ్ళిపోయాడు అసలా అబ్బాయి మెట్లన్నీ దిగనేలేదు. కిటికీకి పైన వెంటిలేటరుందికదా. గదిలో ఎవరైనా ఉన్నారా, ఉంటే వాళ్ళేం చేస్తున్నారు అన్నది అందులోంచి కనబడదు, గాని గదిలో ఎవరైనా ఉంటే మాత్రం అందులోంచి వేసిన కేక వినిపిస్తుంది, ఆ లెవెలుకి రాడానికి మేడమించి అయిదారు మెట్లుదిగితే చాలు. అంచేత ప్రకాశం ఆ కేకవిని గది తలుపు తెరిచి మెట్లదాకా వచ్చేసరికే ఆ అబ్బాయి పైకి వెళ్ళిపోయేడు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ ప్రకాశం మొదటి మెట్టు దగ్గిర నుంచుండి పోయేడు.

"ఏమండి! మీకు ఫోన్" అని ఆ అబ్బాయి వేసిన కేక వంటింట్లోవున్న జ్యోతికికూడా వినిపించింది. "మౌనవ్రతంనాడు ఫోన్ లో మాత్రం మాట్లాడొచ్చా?" అని మనసులో కలిగిన సందేహానికి ఆమెకి చిరునవ్వు వచ్చింది. ఖచ్చితంగా చెప్పాలంటే మాట్లాడనే కూడదు. కాని ఈ ధర్మసూక్ష్మం ప్రకాశానికి తట్టిందో లేదో. అతను ఫోనొచ్చిందికదా అని (దూరంగా ఉన్న మనిషితో మాట్లాడెయ్యొచ్చు కదా అని) సరదాపడి వెళ్ళి మాట్లాడేస్తాడేమో అని చిలిపి దిగులుతో, చేస్తున్న పని ఆలా వదిలేసి గదిలోకి, మెట్ల

దగ్గిరికి వచ్చేసింది.

ఫోనొచ్చింది అని సూచిస్తూ చెవిదగ్గిర ఎడంచేతి పిడికిలి మూసిపెట్టుకుని కుడిచేతి చూపుడు వేలును మేడమీదికి చూపించేడు ప్రకాశం.

ఎడంచెయ్యి నోటికి అడ్డంగా పెట్టేసుకుని, కుడిచేత్తో "వీల్లేదు" అని సంజ్ఞ చేసింది జ్యోతి.

"మరి ఎలాగ" అని సూచన చేసేననుకుని కుడిచేతి పిడికిలితో ఒకఆంగికం చేసేడు ప్రకాశం

"ఎందుకు మాట్లాడ కూడదు" అన్నాడనుకుంది జ్యోతి. "లోపలికి రండి" అని సంజ్ఞ చేసి మరి అతనివేపు చూడకండా గదిలోకి వెళ్ళిపోయింది.

పెరుగు గిన్నెలోంచి వెన్న తీసి విడిగా పెడ్తూ ఉన్నపాట్న బయలుదేరిన జ్యోతికి పెన్ తీసి రాయాలంటే కుడి చేతికి వెంటనే వీలుకాదు. అందుచేత మళ్ళా వంటింట్లోకి వెళ్ళి వేళ్ళని అంటుకున్న వెన్నను గిన్నె అంచులతో గీకి, ఇంకేమీ వృధా పోలేదన్నంత వరకు ఆ పనిచేసి ఇవతలికి వస్తూ ఉండగా. ఎంతసేపటికీ రాదేమి ఈ కరణేషు మంత్రి అని చిరాకు పడుతూ వంటింటివేపు వస్తున్న ప్రకాశాన్ని ఢీ కొట్టింది.

"హుఁ" అంటే "హుఁ" అనుకున్నారిద్దరూను.

"ఉండండి" అని సంజ్ఞచేసి గదిలోకి వచ్చింది జ్యోతి. మంచం పక్కన టీపాయ్‌మీద పెన్ ఉందిగాని కాగితం లేదు. ఏవో కాగితాలున్నాయిగాని వాట్లో ఏ ఒక్కటీ చిత్తురాతకి పనికొచ్చేటట్లు లేదు. మెడికల్ షాపువారిచ్చిన రశీదు అది బిల్లు పెట్టుకోడానికి కావాలి. వెనకాల ఖాళీగానే ఉంది కాని డాక్టర్‌గారు అక్కడేదో రాసి సంతకంపెట్టే పనివుంది. ఎవరో స్నేహితుడు ప్రకాశానికి రాసిన ఉత్తరం...దాని వెనకపక్క కూడా ఖాళీగానేఉంది కాని ఆ ఉత్తరంలో ఇది ఫలానా వాళ్ళకి చూపించు, అని ఏదో ఉంది. అంచేత దానిమీదకూడా ఏమీ రాయకూడదు. ఇంక మిగిలినవి రెండు వేపులా రాసినవో టైపు చేసినవో అచ్చు వేసినవో ఉన్నాయిగాని ఖాళీజాగా ఉన్నవి, ఆ సమయంలో చేతికి అందలేదు. పిల్లల పుస్తకాలు అద్దాల అల్మారాలో ఉన్నాయి. దానికి చిన్న తాళంకప్ప. అది తెరిచి, ఒక నోట్‌బుక్ తీసి, అందులోది ఒక కాగితం ముక్క చించి, ఆ పుస్తకాన్నే వొత్తుకి పెట్టుకుని, రాయడానికి కూర్చునేటంతలో మేడమీది వాళ్ళబ్బాయి మళ్ళీ వచ్చాడు. "అయ్యో, ఇంట్లోనే ఉన్నారా? మీరు ఎంతకీ రాకపోతేనూ, లేరేమో అనుకుంటున్నాను" అన్నాడు.

"ఆగు" అని సంజ్ఞకి చెయ్యి అడ్డం పెట్టింది జ్యోతి. కాగితంమీద 'చకచకా' రాసేసింది, ""ఇవాళ మేం ఇద్దరం మౌన వ్రతం. అంటే అసలే ఏమీ మాట్లాడకూడదని నియమం పెట్టుకున్నాం" అని.

"అయితే?" అన్నాడు ఆ అబ్బాయి

"మాకోసం ఎవరైనా ఫోన్ చేస్తే వారికి ఈ సంగతి చెప్పాలి. అవసరం అనుకుంటే వాళ్ళు ఇక్కడికి రావచ్చు. మేం ఇంట్లోనే ఉంటాం" ...వ్రాత.


"మరి అప్పుడు మాత్రం ఎలా మాట్లాడతారు?"– మాట. చిరునవ్వు.

"ఇదుగో ఇలాగే. మేం రాస్తాం, వాళ్ల








మాట్లాడతారు ?"- వ్రాత.

ఆఅబ్బాయికీ నవ్వొచ్చింది. "సర్లెండి అలాగే" అని వెనక్కి తిరిగాడు.

పెన్ కిందపడేసి చప్పట్లు కొట్టింది జ్యోతి. ఆ అబ్బాయి మళ్ళీ ఇటు చూశాడు. "థేంక్స్. మీకు చాలా శ్రమయిస్తున్నాం" అని రాసి ఆతనికి చూపించింది జ్యోతి.

"ఫరవాలేదులెండి" — అని చెప్పి ఆ అబ్బాయి వెళ్ళాడు.

ప్రకాశం 'జ్యోతి మొహాన్ని తన చేత్తోనూ మూత్తోనూ అభినందించి, ఆమె చేతిలో పెన్ లాక్కుని "నువ్వు చాలా గొప్ప" అని ఇంగ్లీషులో రాసేడు. జ్యోతి తన మందమీద కొద్దిగా మిగిలిపోయిన వెన్న జిడ్డు అతని మొహానికి పట్టించి "మీరు చాలా జిడ్డు" అని రాసి వంటిం ట్లోకి పారిపోయింది.

● ● ●

"ఇదుగో, చూడండీ -" తలుపు తీసుకుని లోపలికొచ్చిన సుందర రామయ్య ప్రకాశంతో అన్నాడు. "సారీ ! మీ జోనల్ మేనేజర్ నీలకంఠేశ్వర రావుట- ఈవూరికి ఇవాళే క్యాంప్ వచ్చాట్ట. బృందావన్ లాడ్జి రూమ్ నెంబరు 318లో ఉన్నాట్ట. ఫోన్‌చేసి లైన్లో వున్నాడు."

"ఒక్క నిమిషం కూర్చోండి" అని చెప్పటానికి రెండు సంజ్ఞలు చేసి కాగితం కలం పుచ్చుకుని వంటింట్లోకి వెళ్ళాడు ప్రకాశం. "టెలిఫోన్‌కి మినహాయింపు ఇచ్చెయ్యకూడదూ" అని రాసి జ్యోతికి చూపించాడు.

జోనల్ మేనేజర్ నీలకంఠేశ్వరరావుని కలవడం, అతను రేపు ఉదయం మొదటి బస్సులో శ్రీకాకుళం వెళదామని ప్రోగ్రాం నిర్ణయించడం అక్కణ్ణించి విజయనగరం వచ్చి పన్లు చూసుకుని ఎల్లుండి సాయంకాలానికి ఇంటికి చేరవలసి వుండడం అవన్నీ వివరంగా సందేహాలకి సమాధానాలతో సహా రాసుకుని "భోజనం చేద్దాం" అని సంజ్ఞలు చేసుకున్నారు, ప్రకాశం, జ్యోతి.. "సరే" అన్నట్టు తల ఆడించి లేచిన జ్యోతిని చెయ్యిపట్టుకుని ఆపి, "అంటే ఏమన్న మాటా, మన మౌనవ్రతం ఒకరోజు అనుకున్నదల్లా మూడు రోజులు అవుతోంది" అనిరాశాడు ప్రకాశం.

భోజనాలు చేస్తున్నంత సేపూ ఏమీ రాసుకోడానికి వీల్లేకా (ఇద్దరికీ కుడి చేత్తో




రాసే అలవాటే ; మరి !) సంజ్ఞలు చేసుకోడంతో అనుభవం చాలక నానా అవస్థాపడి ఎలాగో అయిందనిపించేరు, మొదట ఇవతలి కొచ్చింది, ప్రకాశం, గది తలుపు చప్పుడు, అందులోంచి సందులోంచి ఉత్తరం.


జ్యోతికి, ఉత్తరం చూపించి, "మీ తమ్ముడు." అని చెప్పడానికి కొక సంజ్ఞ చేసేడు ప్రకాశం. జ్యోతికి అది సరిగ్గా అర్థమైనట్టు, ప్రవర్తించక పోగానే కవరు తెరవకుండానే కలంతో "సత్యం, ఏలూరు" అని దాని మీద రాశాడు. "విప్పండి" అన్నట్టు సంజ్ఞ చేసింది జ్యోతి.

"డియర్ బావగారూ ! మేం అంతా ఇక్కడ కులాసా మీరూ ! అక్కా క్షేమం అని తలుస్తున్నాము. పిల్లలు బాగా ఆడుకుంటున్నారు, నాకు ఈ నెల 17 వ తేదీని మంగళ వారం ఉదయం 8 గంటలకి మీ వూళ్లో ఒక కంపెనీలో ఇంటర్‌వ్యూకి రమ్మని పిలువు వచ్చింది. నాకే కాక, నా స్నేహితుడు రవికి కూడా అదే కంపెనీలో అదే వుద్యోగానికి ఆరోజే ఇంటర్‌వ్యూకి రమ్మని పిలుపు వచ్చింది. మేం ఇద్దరం సోమవారం సాయంకాలానికి అక్కడికి వస్తున్నాము. రవి వాళ్ళ బంధువులకి మీ వూళ్ళో బృందావన్ అని ఒక లాడ్జింగు ఉందట. అక్కడ ఉంటాము. సోమవారం సాయంకాలం మేం ఇద్దరం మీ ఇంటికి వస్తాము. మంగళవారం ఇంటర్‌వ్యూ అయిపోగానే ఆరోజే మెయిల్‌కి వచ్చేస్తాము. ఇద్దరం కనుక మీ ఇంట్లో వుంటే ఇబ్బంది అని అతన్ని వొంటరిగా వదిలెయ్యడం బాగదని లాడ్జిలో ఉంటున్నాము. అన్యథా భావించ వద్దని మనవి. అక్కను అడగానని చెప్పవలెను. సోమవారం అనగా 15వ తేది సాయంకాలం ముఖస్తంగా విశేషాలన్నీ మాట్లాడుతాను- ఇట్లు, సత్యం"

"నిన్న మనం స్వామీజీ ఉపన్యాసానికి వెళ్ళినప్పుడు వాళ్ళు మనింటికి వచ్చుంటారు" అని రాసింది జ్యోతి.

ఉదయం ఒక చిత్తు కాగితం మీద ప్రారంభమైన వాళ్ళ "రాత- భాషణం" (అప్పుడొక) మాటా (అప్పుడొక) మాటా పెరిగి, ఇక విడి కాగితాలతో కుదరక,






ఒక ఎక్సర్‌సైజ్ బుక్‌లో ప్రవేశించింది. ఇది ఎనిమిదో పేజి.

"ఓ చీటీ రాసి తాళం కప్పకి తగిలించి ఉండొచ్చుకదా" అని రాసేడు ప్రకాశం.

"రాసిపెట్టేడేమో మనం వచ్చేసరికి ఆలస్యం అయిపోయింది. ఆ దృష్టిలో లేక మనం చూడలేదేమో"

"మకీని! కప్పతాళానికి పెట్టిన చీటీ చూడకుండా లోపలికొచ్చేసేటంత లేటేమీ అయిపోలేదు."

"కప్పతాళానికే పెట్టేడో చీటీ లేక మడతపెట్టి తలుపు సందులోంచి లోపల వేసేడో."

"అలా అయినా మనం లోపలికి రాగానే లైటేసినప్పుడు కనిపించాలి కదా?"

"కప్పతాళానికి పెట్టిన చీటీ గాలికి ఎగిరి పోయిందేమో"

"ఏడవలేక పోయాడు. అన్నీ ఇలాంటి పిడతపన్లే. చేసేదేదో సవ్యంగా చెయ్యకూడదు?"

"ఏమిటి వాడు చేసినదాంట్లో అపసవ్యం?"

"సోమవారం వస్తున్నానని రాసిన ఉత్తరం మంగళవారం నాటికి అందేటట్టు రాయటం ఒకటి."

'ఒకటి-ట, ఇంకా వున్నాయిగావును'

"వాళ్ళ ఫ్రెండు ఉంటేమాత్రం ఏం, మనింట్లోనే దిగొచ్చుకదా! అద్దె లేకండా లాడ్జిరూమ్ దొరికిందని పెద్ద గొప్పగా లాడ్జిలో దిగటం—"

"చాల్లెండి. ఇక్కడికొస్తే తనకేకాక తన ఫ్రెండుకికూడా ఇబ్బంది అని వాడు ఉద్దేశంగా. పైగా మనకి నాలుగు రోజుల నుంచి నీళ్ళు సరిగా రావట్లేదు"

"పోనీ అతని ఫ్రెండుని లాడ్జిలో వదిలేసి తను సరాసరి మనింటికి వచ్చెయ్యొచ్చుగా."

"వచ్చేడే అనుకోండి. ప్రత్యక్షమైనట్టుగా తాళం కప్ప; దేవుడా అని మళ్ళీ ఆటోలోనో రిక్షాలోనో ఆ లాడ్జికే ఆఘోరించాలికదా!"

"సోమవారంనాడు వస్తున్నాను అని ఒక టెలిగ్రాం యిస్తే మనం ఖచ్చితంగా ఇంటిపట్టున ఉండిపోయేవాళ్ళం కాదేంటి?"

"సరే, ఏదో స్నేహితుడి సలహా వల్లనో మరో కారణం వల్లనో తనకి తోచినట్టు చేసేడు. ఇప్పుడు మీరెళ్ళింది ఆ బృందావన్ లాడ్జికేకదా. ఓసారి చూడకూడదు గావును"

"ఓహో, బాగా సలహా చెప్పేవు. మా జోనల్ మేనేజర్ కోసం వెళ్ళిన లాడ్జింగేకదా అని, మీ లాడ్జిలో ఎవరెవరు ఏయేరూముల్లో దిగారు, కాస్త పేర్లూ అడ్రసులూ చెప్పండి అని అడిగి వుండవలసిందిగాబోలు. వీపు ఛిట్లగొట్టి పంపేవాళ్ళు."

"సరే, సరే, సరే! ఏదో అయిపోయింది. మేమూ, మా తమ్ముళ్ళూ అందరం తెలివితక్కువవాళ్ళం. అంతేగా మీరనేది" అని రాసేసి బుంగమూతి పెట్టి అటు తిరిగి పోయింది జ్యోతి.

ప్రకాశం పుస్తకం కిందపెట్టేసి ఆమెని దగ్గరకు తీసుకున్నాడు. కళ్ళు తుడిచినట్టు అభినయం చేసేడు. గడ్డం పుచ్చుకుని "నా తల్లే, యాదవకమ్మా" అన్నట్టు మూతి తిప్పాడు. జ్యోతి అతన్నుంచి తప్పించుకుని మళ్ళీ పుస్తకం అందుకుంది.

"అదికాదు. మళ్ళీ ఓసారి వెళ్ళండి. వాళ్ళింకా బయల్దేరి వెళ్ళి పోయి వుండరు. వెంటనే వెళ్ళి తమ్ముణ్ణి తీసుకురండి" అని రాసింది.

నెత్తి కొట్టుకున్నాడు ప్రకాశం. వాచీ చూపించాడు ఒంటిగంటా నలభై. ఈ పాటికి మెయిల్ అనకాపల్లి దాటేసి ఉంటుంది.

"పోనీ రైలు స్టేషన్ కెళ్ళండి. ఖర్మకాలి మెయిల్ ఓ గంట లేటయినా చాలు. వాడు దొరుకుతాడు, ప్రయాణం ఆపేసి ఇంటికి తీసుకురండి, అంతగా రేపు తనకి కలవు లేదంటే "బొకారో" కో "గోదావరి"కో పంపిద్దాం"

"ఏమో, ఈ ప్రయత్నం అంతా దండుగేమో నని నాకు అనిపిస్తోంది.—"

"అసలు మీకు సత్యం మీద ఏమీ అభిమానం ఆపేక్షలేవు. అందుకే ఇలా ఎడ్డం అంటే తెడ్డం అంటున్నారు."

"అతనికి మన మీద మహా ఉంది గావును, ఆపేక్ష, అభిమానం అనురాగం వ్వ. తన ఇంటర్వ్యూ తన ఫ్రెండు అనే చూసుకున్నాడుగాని, అయ్యో అక్కా-బావా ఉన్నారు, వాళ్ళతో ఓ గంట కబుర్లు చెబుదాం, పిల్లలు కూడా ఏలూర్లో ఉన్నారు; ఆమాటా ఈమాటా చెబితే సంతోషిస్తారుఅని ఏమైనా ఆలోచించాడా? అంతగా మనల్ని చూడాలని అతనికి వుంటే రాత్రి ఎనిమిది గంటలపుడు మనం లేకపోతే ఏ సినిమాకో వెళ్ళేరనుకుని పది గంటలప్పుడు ఓ మారు మళ్ళా రావచ్చుగా?"

"మీ ధోరణి చాలా బావుందే. వేలికేస్తే కాలి కేస్తున్నారు. కాలి కేస్తే మెడ కేస్తారు."

"పోనీ అయిందేదో అయింది. ఆ లాడ్జికో రైల్వే స్టేషన్‌కో ఓ సారి వెళ్ళి రాకూడదేం?"

"అంత దూరం వెళ్ళనే అక్కర్లేదు" అది ఇంకా ఏదో రాయబోతూవుంటే జ్యోతి ప్రకాశం చేతుల్లోంచి కలం పుస్తకం లాగేసుకుని కలం ముడిచేసి పుస్తకం నేలకేసి కొట్టేసింది.

ప్రకాశం కింద పడిన పుస్తకం తీసుకుని వివరంగా మళ్ళీ రాశాడు. "ఇప్పు




దేదో పూర్తిగా చెప్పనియ్యవు. రైల్వే స్టేషన్‌కి ఫోన్ చేసి మెయిల్ లేటేమో కనుక్కుని మిగతా కార్యక్రమం రూపొందించుకో వచ్చు కదా అని రాయబోతే నువ్వు ఊరికే అలిగి పుస్తకం విసిరికొట్టి - ఏమిటి ఇదంతా ?"

అలోగా జ్యోతి రెండు చేతులూ మొహం మీద మూసుకుని తలగడ మీద బోర్లాపడి ఏడ్చెయ్యడానికి సిద్ధం అయిపోయింది. ప్రకాశం ఆమెని తట్టి "ఊఁ!" అని అబ్బం చేసి కొత్తగా రాసింది చూపించేడు.

"మరి వెళ్ళండి, ఫోన్ దగ్గిరికి." అని రాసింది.

"ఇప్పుడు సుందర్రామయ్యగారు ఇంట్లో వుండరు, అందుచేత, ఫోన్ దగ్గిరికి వెళ్ళవలసింది నువ్వుగాని, నేనుకాదు"

"మనం యిలా తర్జన భర్జనలు చేసుకుంటూ కూర్చుంటే ఈలోగా పుణ్యకాలం కాస్తా మించిపోయి రైలు గంట లేటు వచ్చినా వెళ్ళి పోతుంది."

"కనక, త్వరగా నడు, మేడమీదికి. ముందే కాగితం మీద, రైలు స్టేషన్‌కి ఫోన్ చేసి ఆవిడే, మెయిలు లేటా రైట్ టైమా కనుక్కోవాలనీ, అప్పుడు. లాడ్జికి ఫోన్ చేసి ఆవిడే సత్యంతో మాట్లాడి ప్రయాణం ఆపు చేసుకోమని చెప్పాలనీ రాయి."

"గొప్ప తెలివి తేటలే."

"ఏం, కాక ?"

"లాడ్జిలో రూమ్ మా తమ్ముడి పేరిట ఉంటుందేం ?"

"కాకపోతే ఆ ఫ్రెండు రవి పేర్న ఉంటుంది ; రవి, ఏలూరు నుండి వాచ్చారు - అని సూచనగా చెప్తే చాలు, వాళ్ళే కనెక్షన్ ఇస్తారు."

"ఏమిటో, ఖర్మ !" అన్న సంజ్ఞ చాలా సులువుగా చెయ్యెచ్చు. కనక సంజ్ఞే చేసి, మేడమీది సుందర్రామయ్య భార్యకి చూపెట్టవలసిందంతా ప్రకాశం కోసం కాడు గనక వేరే పేజీ ప్రారంభించి బాగా కుదురైన దస్తూరితో రాయసాగింది. అది పూర్తయ్యేలోగా ప్రకాశం రెండుసార్లు వాచీ ఆమె కెదురుగా తెచ్చేడు రెండుసార్లూ అతన్ని హుంకారంతో వదిలించు కుంది జ్యోతి.

"ఏదానికైనా మంచిది. మీరు ప్యాంటు షర్టు వేసుకుని స్కూటర్ తీసి సిద్ధంగా ఉండండి" అని రాసి ప్రకాశానికి చూపించింది. ఓకే అన్నట్టు తల ఆడించి లేచాడు ప్రకాశం.

అప్పుడు తలుపు చప్పుడైంది.

"నే చెప్పానా! మా తమ్ముడే వొచ్చాడు !" అనేభావంకోసం చేతనైన విధంగా సంజ్ఞచేసి చాటంత మొహంతో నవ్వుకుంటూ వెళ్ళి తలుపు తీసింది జ్యోతి.

వచ్చిన వ్యక్తినిచూసి ఇద్దరూ నిర్ఘాంత పోయారు.

అతను జ్యోతి తమ్ముడు సత్యంకాదు.

జ్యోతి పెదనాన్నగారు, రఘురామయ్య.

"ఏమమ్మా కులాసా? పద." అంటూ లోపలికి వచ్చి, చెప్పులు విడిచి "ఆఁ, ఏంటి, ఈరోజు ఇంటిదగ్గరే ఉన్నావే, సెలవా బాబూ ఇవాళ?" అంటూ కుర్చీలో కూర్చున్నాడు అతను.

జ్యోతి లోపలికి పరుగెత్తుకెళ్ళి మంచి నీళ్ళ గ్లాసుతో వస్తూ "మౌనం జాగ్రత్త" అని ప్రకాశానికి సంజ్ఞ చేసింది.

ప్రకాశం, ఆయన మంచినీళ్ళు తాగేలోగా "ఇవాళ మాకు సెలవు మామయ్యగారూ. అందుకే ఇంటిదగ్గరున్నాను... అయితే, మౌనవ్రతం పాటిస్తున్నాం ఈ రోజు; మీవంటివారే మాకు మార్గదర్శకులు" అని రాసి పుస్తకం ఆయనచేతిలో పెట్టాడు.

ఆయన జేబులోంచి కళ్ళజోడుతీసి ఆ సందేశం చదివి, "మంచిదే. కాని మౌనవ్రతానికి మంగళవారం మంచిది కాదు. సోమవారం, లేదా శనివారం దానికి తగినరోజు. పోనీలెండి, ఏదో ఓరోజు పాటిస్తున్నారు, అది మెచ్చుకోతగిన సం



గతే. యోగవాశిష్ఠంలో చెప్పేడు. మౌన వ్రతం పద్ధతిగా ఆచరించడంవల్ల కలిగే లాభాలు. ఇంతకీ ఎన్ని వారాలయింది ప్రారంభించి ? నేనెప్పుడూ విన్లేదే?" అన్నాడు.

జ్యోతీ ప్రకాశం మొహాలు చూసుకున్నారు.

జ్యోతి ఆయన పక్కనే ఇంకో కుర్చీ వేసుకుని కూర్చుని "నిన్నరాత్రి స్వామి మహత్తరానంద అనేఆయన ఉపన్యాసం విని ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇవాళే మొదలు" అని రాసి పుస్తకం ఆయనకి అందించింది.

ఆయన తల నిలువుగా ఆడించి "సరే! ఏదో హడావిడిగా వున్నారేమిటి మరి ?" అన్నాడు.

"సత్యం నిన్న ఊళ్ళోకొచ్చాడట. ఇక్కడికి రాలేదు. ఈపూట మెయిల్‌కి వెళ్ళిపోతాడట. వాణ్ణి ఆపాలని రైల్వే స్టేషన్‌కి ప్రయాణం అవుతున్నారు మీ అల్లుడుగారు" అని రాసింది జ్యోతి.

"సత్యం రాలేదులేమ్మా ! నేను ఏలూర్నుంచే వస్తున్నాను. వాడికి ఇవాళ ఇక్కడ ఇంటర్వ్యూ జరగవలసింది, అది వారానికి వాయిదా వేస్తూన్నట్టు నిన్న ఉదయం అక్కడికి టెలిగ్రాం వచ్చింది. సరే, మీ పిల్లలిద్దర్నీ అక్కడ చూశాను. మిమ్మల్ని కూడా చూడాలనిపించి ఇప్పుడే మెయిల్ దిగివస్తున్నాను" అన్నాడాయన

ప్రకాశం మంచం మీద చతికిలపడి నిట్టూర్పు వదిలాడు. జ్యోతి ఆందోళన సడలినందుకు భారీగా నవ్వింది.

ఈలోపుగా ఆయన యధాలాపంగా పుస్తకం అంతా తిరగేసేసి, పకపకా నవ్వాడు.

"చూస్తే మీరిద్దరూ చాలా సంభాషణే చేసినట్టుగా ఉందే !" అన్నాడు. పుస్తకం మూసేసి, జ్యోతి తలమీద చెయ్యివేసి నిమిరి "మౌనవ్రతం అంటే మాట్లాడ్డం మానెయ్యడం ఒక్కటే అనుకుంటున్నారా అమ్మా ? ఇంతలేసి గ్రంథం రాసేస్తే అది మౌనం కాదు, అలుసా ? మనలో చెలరేగే ప్రాథమిక భావాలను ఎవరికీ తెలియపర్చకుండా మనలో మనమే అంటే మనసును మనసులోనే సంయమ మార్గంద్వారా నిక్షిప్తం చేసుకుని రాగ ద్వేషాలకు అతీతంగా ఉండటమే మౌన వ్రతం అనిపించుకుంటుందిగాని ఇలా పేజీలకు పేజీలు నువ్వెంతంటే నువ్వెంతని వాదించుకుంటే అది మౌనం కాదు" అన్నాడాయన.

జ్యోతి సిగ్గుతో తల వంచుకుంది.

ప్రకాశం ఎటో చూసేడు.

"లే,లే! మీరేం మౌనవ్రతంలో లేరు. ఎంచక్కా కడుపునిండే కబుర్లు చెప్పు తల్లీ" అని ఆయన జ్యోతి వీపుమీద తట్టాడు.

"థాంక్స్ ! పెదనాన్నా" అంది నవ్వుతూ జ్యోతి. •••

Edited & Published by V. Leelavathy Raghaviah, at 1-8-519/11 Chikkadpally, Hyd 20. & Printed by P. Ramakrishna at Raghava Printers, 1-8-4/1/1, Chikkadpalli, Hyderabad-20

